# మరణానికి ఆవల...

■ తోలేటి జగన్మోహనరావు
■ చిత్రాలు: మోతుకూరి రమేష్

మరణం తర్వాత జీవితం ఉంటుందా? ఒక అర్ధరాత్రి వేళ పన్నెండు గంటల సమయంలో, ఎనిమిదేళ్ళ క్రితం మరణించిన వ్యక్తిని కలుసుకునేంతవరకూ చావుతో అంతా ముగుస్తుందనీ, ఆ తర్వాత ఏమీ ఉండదనీ అనుకునేవాణ్ణి. అతన్ని కలిశాకా నా అభిప్రాయం మార్చుకోవాల్సి వచ్చింది.

అప్పుడు నేను భువనేశ్వర్ నుంచి ఛత్రపూర్ లారీలో ప్రయాణం చేస్తున్నాను. రాత్రి పదకొండు గంటలకి లారీ డ్రైవర్ సర్దార్జీ, రోడ్డు పక్క ధాబా హోటల్ దగ్గర లారీ ఆపుచేసి, 'బాబూజీ- చలో- ఖానా ఖాయేంగే' అన్నాడు.

ధాబా ముందు కొబ్బరాకుల పందిరి కింద టేబుళ్ళు, కుర్చీలు, నులక మంచాలు ఉన్నాయి. నేను టీ మాత్రం తీసుకున్నాను. సర్దార్జీ ఒక అరడజను రొట్టెలు లాగించి, ఒక లోటాతో లస్సీ తాగి, 'బాబూజీ- ఒక చిన్న కునుకు తీశాక బయలుదేరుదాం' అంటూ నులకమంచం మీద వాలి మరుక్షణం గుర్రు పెట్టసాగాడు.

కలకత్తా-విశాఖపట్టణం హైవే మీద లారీలు ప్రవాహంలా అటూ ఇటూ వెడుతున్నాయి. మధ్య మధ్య ఏ డ్రైవరో భోజనం చెయ్యాలనుకున్నప్పుడు లారీ రోడ్డు మీంచి పక్కకు తిప్పి, ధాబా దగ్గర ఆపుతున్నాడు. అక్కడ, మీద టార్పాలిన్ కప్పిన నాలుగైదు లారీలు, మసక వెన్నెల్లో నిలబడి నిద్రపోతున్న ఏనుగుల్లా కనిపిస్తున్నాయి. కేబుల్ టీవీలలో అందాల పోటీ లైవ్ టెలికాస్ట్ వస్తోంది. టీవీ ముందు కూర్చున్న డ్రైవర్లు స్విమ్మింగ్ డ్రెస్సులో సుందరి కనుపించినప్పుడల్లా ఒకళ్ళ భుజాలు ఒకళ్ళు గట్టిగా చరుస్తూ, ఈలలేస్తూ, అసభ్యకరమైన జోకులు వేస్తూ పగలబడి నవ్వుతూ గోల చేస్తున్నారు.

వేసవి కాలం మూలాన రాత్రి చల్లగా ఉంది కానీ చలిగా లేదు. నేను సిగరెట్టు అంటించి, కాస్త కాలు సాగుతుందని ఒక ఫర్లాంగు నడిచి అక్కడ, ఆ గోలకి దూరంగా ఒక బండ మీద నడుం వాల్చాను.

"బాబూజీ- ఎక్కడికి వెడుతున్నావు?" - హిందీలో ప్రశ్న వినిపించింది.

నేను ఉలిక్కిపడి లేచి చూశాను. ఎదురుగా ఆరడుగుల ఆజానుబాహుడు నిలబడి ఉన్నాడు.

"ఛత్రపూర్."

"ఛత్రపూర్‌లో ఉంటావా?"

"కాదు... గంజాంలో మా తోడల్లుడి ఇంటికి వెడుతున్నాను. ఉండేది ఢిల్లీలో..."

ఢిల్లీ అనగానే మసక వెన్నెల్లో అతని ముఖకవళికల్లో వచ్చిన మార్పు అంత స్పష్టంగా కనుపించలేదు గానీ, మాటలో ఉద్రిక్తత కనుపించింది.

"ఢిల్లీలో ఏం చేస్తుంటావు?"

"సెంట్రల్ సెక్రటేరియట్లో..."

"ఉండేది ఎక్కడ?"

"బాబా ఖరక్ సింగ్ మార్గ్ క్వార్టర్సులో..."

"బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లోనా..." - అతని గొంతు విచారంగా ధ్వనించింది. నీరసంగా నా పక్కనే కూలబడ్డాడు.

"నువ్వేం చేస్తుంటావ్?" ఈసారి ప్రశ్న అడగడం నా వంతు అయింది.

"నేనా?" అతను సమాధానం చెప్పడానికి తడబడ్డాడు. "నేను... శాస్త్రీ భవన్‌లో పనిచేసేవాణ్ణి. మీ ఇంటికి దగ్గరే. బిర్లా మందిర్ ఎదురుగా క్వార్టర్సులో ఉండేవాణ్ణి. ఇప్పుడేం చేస్తున్నానూ... చచ్చిపోయి ఎనిమిదేళ్ళయ్యాకా ఇప్పుడేం చేస్తున్నాను?"

నా గుండె ఝల్లుమంది. అతను దయ్యమై తిరుగుతున్నాడనుకోలేదు కానీ, పిచ్చాడి పాలబడ్డానేమోనని భయం వేసింది. నేనేం అనుకుంటున్నానో అతనికి అర్థమైనట్టుంది. -"నేను నిజంగానే చచ్చిపోయాను. ఎనిమిదేళ్ళ క్రితం నిజంగానే చచ్చిపోయాను" అంటూ అతను కొంత పంజాబీలోనూ, కొంత హిందీలోనూ తన వింత కథ చెప్పసాగాడు.

"ఏభై ఏళ్ళు సాఫీగా సాగిన నా జీవితంలో ఏ క్షణంలో నా చావుకి అంకురార్పణ జరిగింది? ఎక్కడ మొదలు పెట్టను?" అతను రెండు నిమిషాలు ఆలోచిస్తున్నట్లు ఆగిపోయాడు. "ఆ రోజు నాకు బాగా గుర్తుంది. ఉదయం కాలింగ్ బెల్ మోగుతుంటే తలుపు తీశాను. ఎదురుగా నా బావమరిది. వాణ్ణి చూడగానే నా గుండె జారిపోయింది. వాడు అడుగు పెట్టినప్పుడల్లా నాకు ఏదో అరిష్టం కలుగుతుంది."

"ఏవిటలా నిలబడిపోయావు జీజాజీ" అన్నాడు వాడు లోపలికి వస్తూ. మా వాడు యూత్ లీడర్. నేను వాణ్ణి వేళాకోళంగా "ఊత్ (పంజాబీలో గాడిద) లీడర్" అంటుంటాను. వాడి తల వీడికి, వీడి తల వాడికి మార్చడం, వాడినీ, వీడినీ కొట్టుకు తినడం వాడి ఉద్యోగం.

వాడి వెనకాలే ఓ ఏభై ఏళ్ళ పెద్దమనిషి వచ్చాడు 'నమస్తే' అంటూ. ఎవరా అని చూస్తుంటే, "గుర్తు పట్టలేదా, మా మావగారు" అన్నాడు మా బావమరిది. వాడి మావగారిని వాడి పెళ్ళిలో చూశాను కానీ, తర్వాత ఎప్పుడూ చూడలేదు. అంచేత గుర్తు పట్టలేకపోయాను.

మా ఆవిడ ఆదరంగా, "రండి, రండి" అంటూ ఆహ్వానించింది. వాళ్ళిద్దరూ లోపలకు వచ్చారు.

"ఏవిటి? అంతా కులాసాయేనా?"

"అంతా కులాసా కాదు కనుకనే ఈయన్ని ఢిల్లీ తీసుకొచ్చాను. ఇక్కడ హార్టు స్పెషలిస్టులకి చూపిద్దామని..." అన్నాడు నా బావమరిది వాళ్ళ మావగారిని చూపిస్తూ. గోధుమ బస్తాలా సోఫాలో కూర్చున్న వాడి మావగారు అనారోగ్యంగా ఉన్నానన్నట్లు సందర్భానుసారం కొన్ని వింత ధ్వనులు చేశారు. ఆయనతో నాలుగు మాటలు మాట్లాడి నేను ఆఫీసుకు వెళ్ళిపోయాను.

లంచ్ టైమ్‌లో బొంబానీ - బొంబానీ పాతికేళ్ళుగా నా క్లోజ్ ఫ్రెండు- నేనూ పేకాడాం రోజూ లాగానే.

"బొంబానీ! ఇవ్వాల్టి దానితో కలిపి, నువ్వు నాకివ్వాల్సింది నాలుగు వందల అరవై అయిదు" అన్నాను లెక్క తేల్చి చెబుతూ.

"పది రూపాయలు పెట్టి కొన్న పల్లీలలో సగం నువ్వే తినేశావు కదా" అన్నాడు బొంబానీ ఏడుపు మొహంతో.

"సరే, దానికి అయిదు తగ్గించు. నాలుగు వందల అరవై. గుర్తుంచుకో."

"నువ్వు ఆఫీసుకు వెళ్ళు నేను స్టోరుకి వెళ్ళాలి" అంటూ బొంబానీ స్టోరుకి వెళ్ళాడు.

నేను ఆఫీసులో అడుగు పెట్టగానే నా బావమరిది దగ్గర నుంచి ఫోనొచ్చింది- "నాకు ఒంట్లో బాగోలేదని సెలవు పెట్టి వెంటనే ఇంటికొచ్చెయ్యి"



అన్నాడు నా బావమరిది.

"నీకు ఒంట్లో బాగోలేకపోతే నేను సెలవు పెట్టడం దేనికి?"

"నాకు కాదు, నీకే."

"నాకేం? రాయిలా ఉన్నాను."

"రాయిలా ఉన్నావు కానీ, ఇంటికి అర్జంటుగా రా."

నేను ఫోను పెట్టేసి కుర్చీలో కూర్చుని ఏమై ఉంటుందా అని ఆలోచిస్తుంటే స్టోరు నుండి సామానులు తీసుకుని బొంబానీ వచ్చాడు.

"బొంబానీ! నాకు... కొంచెం ఒంట్లో బాగా లేదు. ఇంటికెళ్ళిపోతున్నాను. డి.యస్‌కి చెప్పు."

"ఏం రోగం?"

"గుండెల్లో కొంచెం బరువుగా, అదోలా ఉంది" అన్నాను గుండెల మీద రుద్దుకుని ఏక్ట్ చేస్తూ.

"పేకాటలో లూట్ చేశావు కాదా! పార్టీ ఇస్తావనుకున్నాను..."

"పార్టీ రేపిస్తాలే."

నేను ఇల్లు చేరేటప్పటికి మా బావమరిది మావగారిని ఆరెమ్మెల్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారని తెలిసింది. హాస్పిటల్ ఎమర్జెన్సీ దగ్గర మా ఆవిడా, వాడూ ఎదురయ్యారు.

"ఎలా ఉన్నారు మీ మావగారు?"

"రాజాలా ఉన్నాడు. కొంచెం గుండె నరిగ్గా కొట్టుకోడం లేదు. అంతే. యంపీగారి చేత ఫోను చేయించాను. అన్ని టెస్టులూ చకచకా జరిగిపోతున్నాయి."

"మంచి పని చేశావు. బయట ప్రైవేట్ డాక్టర్లయితే వేలకు వేలు దోచేసేవారు."

"పరవా లేదులే... నీ పుణ్యావా అని ఇప్పుడు కానీ ఖర్చు కాదు."

"నా పుణ్యమేమిటి?"

"నీ సి.జి.హెచ్.యస్ కార్డు మీద నీ పేరుతో జాయిను చేసాను కదా!"

నేను అదిరి పడ్డాను. "కొంప ముంచావురా బామ్మర్దీ! అలా చెయ్యకూడదు. రూల్సు ఒప్పుకోవు" అన్నాను కంగారుగా.



"ఏమ్మల్లేవన్నా మర్డరు చెయ్యమంటున్నాడా మా తమ్ముడు? మీ వయసూ, ఆయన వయసూ ఒకటే. ఎవరికీ అనుమానం రాదు. ఆయన నాలుగు టెస్టులూ చేయించుకుని ఆయన ఊరు వెళ్ళిపోతాడు. ఈ మాత్రం దానికి రూల్సు అంటూ మాట్లాడతావేంటి" అంది నా భార్య.

"జీజాజీకి గవర్నమెంటులో పనిచేసి, రూల్సు, రూల్సు అనడమే కానీ, రూల్సు ఎలా బ్రేక్ చెయ్యాలో తెలియదు."

"మీ జీజాజీ సంగతి తెల్సు కదా! ఇవ్వాళ సర్వీసులో జాయినయినవాడు, వాడి కాళ్ళూ, వీడి కాళ్ళూ పట్టుకుని, లంచాలు మేపీ, వెంటనే క్వార్టరు సంపాదిస్తుంటే, ఈయన పాతికేళ్ళ సర్వీసు వెలగబెట్టి ఇన్నాళ్ళకు ఇప్పుడు సంపాదించాడు ఓ బోడి క్వార్టరు..." అంది మా ఆవిడ దెప్పుతూ.

"జీజాజీకి ప్రతిదానికీ భయం" అన్నాడు నా బావమరిది జాలిగా.

నేను ఒకళ్ళకే సమాధానం చెప్పలేను. ఇద్దరూ అలా ఎడా పెడా తగులుకునేటప్పటికి తోక ముడిచి ఇంటికి వెళ్ళిపోయాను.

మర్నాడు తెల్లవారుతుండగా మా బావమరిది వచ్చి లేపి, "జీజాజీ! మా మావగారు చచ్చిపోయారు" అని చావు కబురు చల్లగా చెప్పాడు.

"చంపేశావురా బామ్మర్దీ." మంచం మీంచి లేవబోతున్న నేను రెండు చేతులతోనూ తల పట్టుకుని కూలబడిపోయాను.

"ఓహో! ఆయన పోయి మేమేడుస్తుంటే మధ్య నీ గోలేమిటి" అంది మా ఆవిడ విసుగ్గా.

"చచ్చిపోయింది నేను. డాక్టర్లు నా పేరుతో డెత్ సర్టిఫికేట్ రాసేస్తారు. ఈ విషయం ఆఫీసులో తెలిస్తే... సస్పెండయిపోతాను" అన్నాను కంగారుగా.



నా పెళ్ళాం, కొడుకులు, కూతురు – అంతా దిగాలు పడిపోయారు. వాళ్ళు ఇదంతా ఆలోచించలేదు.

"కంగారు పడకు జీజాజీ! ఇప్పుడే కొత్తగా ఈ క్వార్టరులోకి వచ్చారు కదా. ఆఫీసు, ఇల్లు తప్ప నలుగురితో కలిసే రకం కాదు నువ్వు. చుట్టుపక్కల వాళ్ళకి నువ్వు తెలిసే ఉండవు. ఇప్పుడు శవాన్ని ఇక్కడ దహనం చెయ్యడం లేదు కదా. టాక్సీలో మా మావగారి ఊరు తీసుకుపోతాం. టాక్సీ, పోలీసు పెర్మిషన్ – అన్ని ఏర్పాట్లు నేను చూస్తాను కానీ, నువ్వు వెంటనే జలంధర్ వెళ్ళిపో. ఇక్కడుంటే అంతా మెస్ చేసి పడేస్తావు..."

నేను తెల్లారకుండానే, ఐ.ఎస్.బి.టి (బస్ టెర్మినస్)కి పోయి, అక్కడ బస్సెక్కి జలంధర్ వెళ్ళిపోయాను.

మా బావమరిది టాక్సీలో వాళ్ళ మావగార్ని వాళ్ళ ఊరు తీసుకెళ్ళి దహనం చేయించి, నాలుగు రోజులు తర్వాత జలంధర్ వచ్చాడు.

"అంతా సవ్యంగా జరిగిందా?"

"అంతా సవ్యంగా జరిగింది. నువ్వు అనవసరంగా కంగారుపడి అండర్ గ్రవుండులోకి వెళ్ళిపోయావు. అక్కడంతా మనవాళ్ళే. అక్కడే చచ్చిపోయినట్లు చూపించి, దహనం చేసేశాం."

"మళ్ళీ చంపేశావురా బామ్మర్దీ" అన్నాను తల పట్టుకుని కూలబడి.

"ఏమైంది జీజాజీ?"

"ఢిల్లీ నుంచి టాక్సీలో తీసుకువెళ్ళిన శవం ఎవరిదని రేపు పోలీసులు అడిగితే ఏం చెప్పనురా గాడిదా" అన్నాను తల కొట్టుకుంటూ.

"ఢిల్లీ నుంచి తీసుకొచ్చిన శవం ఏమిటి? దహనం చేసేశాం కదా."

"దహనం చేసింది మీ మావగార్ని కదా."

"చచ్చిపోయిందీ మా మావగారే కదా."

"మరి నా శవం?"

"నీ శవమేమిటి జీజాజీ? నువ్వు బతికే ఉన్నావు కదా."

"ఈయనతో వేగలేక చస్తున్నాను. ఒక్కటీ అర్థం కాదు. టీవీ సీరియల్స్ చూస్తూ నిన్న చచ్చిపోయిన వాడు ఇవాళ ఎలా బతికొచ్చాడు అని వాదిస్తాడు" అంది మా ఆవిడ చికాగ్గా.

"జీజాజీకి అంతా కన్‌ఫ్యూజన్ దీదీ! నువ్వు కంగారు పడకు. నేను వివరించి చెబుతాగా" అంటూ నాకేసి తిరిగి, "నువ్వూ, మా మావగారూ–

ఇద్దరున్నారు. రైట్" అన్నాడు రెండు వేళ్ళు చూపిస్తూ.

"రైట్."

"మా మావగారు చచ్చిపోయారు" అన్నాడు ఒక వేలు మడిచి.

"రైట్."

"నువ్వు బతికే ఉన్నావు" అన్నాడు రెండో వేలు కదుపుతూ.

"రైట్."

"ఇంక ప్రాబ్లం ఏవిటి జీజాజీ?"

"ఢిల్లీ నుంచి టాక్సీలో తీసుకొచ్చిన శవం ఏమైందిరా గాడిదా?"

"మా మావగారిని దహనం చేసేశాం కదా."

"ఆయన కాదు, రెండో శవం."

"రెండో శవం అంటావు మళ్ళీ. చచ్చిపోయిన వాళ్ళు ఎందరు?"

"ఒకళ్ళు - మీ మావగారు."

"శవాలు ఎన్ని?"

"ఒకటి - మీ మావగారిది."

"ఆయన్ని దహనం చేసేశాం. ఒకటి లోంచి ఒకటి తీస్తే ఎంత?"

"సున్నా..."

"మరిక ప్రాబ్లం ఏవిటి జీజాజీ?"

"నా శవమేమైందిరా గాడిదా?"

"నా శవమంటావు మళ్ళీ నువ్వు బతికే ఉన్నావు కదా జీజాజీ..."

"నేను బతికే ఉన్నాను. మీ మావగారు ఆయన ఊళ్ళో చచ్చిపోయాడు. అక్కడే దహనం చేశారు. మరి టాక్సీలో శవం ఎవరిదని రేపొద్దుట పోలీసులు పీక పట్టుకుంటే ఏం చెప్పాలిరా గాడిదా."

నేను చెప్పేదేవిటో అప్పటికి బోధపడినట్టుంది- "అరే జీజాజీ! ఇది నేనాలోచించలేదు" అన్నాడు వాడు నాలిక కరుచుకుంటూ.

"ఒరే బామ్మర్దీ! నీ బోడి సలహా ఫాలో అవకుండా అప్పుడే అంతా చెప్పేస్తే సస్పెన్స్‌తో ఆగిపోయేదేమో. ఇప్పుడు మర్డరు కేసు అవుతుంది కదరా" అన్నాను కన్నీళ్ళ పర్యంతమవుతూ.

అంతా దిగాలు పడిపోయారు.

నా బావమరిది కొంచెం సేపు ఆలోచనలో మునిగిపోయాడు. హఠాత్తుగా వాడి మొహం వెయ్యి కాండిలు బల్బులా వెలిగింది.

"అంతా మన మంచికే జీజాజీ" అన్నాడు ఆనందంగా.

"నేను చచ్చిపోవడం నా మంచికా?"

"నీ 'చావు'తో ఎన్ని సమస్యలు తీరిపోతాయో చూడు. పెద్ద వెధవ ఉద్యోగం సద్యోగం లేకుండా తిరుగుతున్నాడు కదా! వాడికి కంపేషనేట్ గ్రవుండ్సు మీద ఉద్యోగం వేయించి, క్వార్టరు ఉంచుకోవచ్చు. వాడి లైఫ్‌కి ఇంక ఢోకా లేదు. జీజాజీ ఇన్‌షూరెన్సూ, గ్రాట్యుయిటీ, ప్రావిడెంటు ఫండు, పెన్షన్- అన్నీ కలిపి అయిదారు లక్షలు..."

"నాకు రెండు లక్షలివ్వండి. నేను బిజినెస్ చేస్తాను" అన్నాడు నా రెండో కొడుకు. వాడి కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

"పీడి. సమస్య కూడా తీరిపోయింది. రెండు మూడు లక్షలు పెట్టి దీని పెళ్ళి చేసేద్దాం" అన్నాడు మా అమ్మాయి కేసి తిరిగి. "చూశావా జీజాజీ! నువ్వు సీన్లోంచి వెళ్ళిపోతే పిక్చరు ఎంత బ్యూటిఫుల్‌గా ఉందో."

"మరి నేను?"

"నువ్వు మాతోటే ఉంటావు" అన్నారు పిల్లలు, మా ఆవిడ.

"కరెక్ట్. నువ్వు అఫీషియల్‌గా చచ్చిపోతే ఏమైంది? మాతోనే ఉంటావు. కొంచెం వేషం మార్చు. గడ్డం పెంచు. పేరు మార్చు దట్సాల్. మిగతాదంతా నే చూసుకుంటా" అన్నాడు మా బావమరిది.

"ఢిల్లీ తిరిగి వచ్చాం. స్నేహితులంతా పరామర్శించడానికి వచ్చారు.

"అంతా కలలోలా అయిపోయింది" అని ఏడవడం మొదలుపెట్టింది మా ఆవిడ.

"ఆ దేవుడు ఎలా నడిపిస్తే ఆలా నడుస్తుంది. మనం నిమిత్తమాత్రులం. నువ్వు ధైర్యంగా ఉండు" అన్నాడు నా బావమరిది నా భుజం తట్టి ఓదారుస్తూ.

"మీ జీజాజీ, నేనూ చాల క్లోజ్ ఫ్రెండ్సమి" అంటున్నాడు బొంబానీ. వాడి గొంతు వినిపించగానే వాడి బాకీ గుర్తొచ్చింది.

"బొంబానీ" అంటూ నేను ముందు గదిలోకి వెళ్ళిపోయాను పొరపాటున.

వాడు సోడాబుడ్డి కళ్ళ అద్దాల్లోంచి నన్ను పరిశీలనగా చూసి, "నువ్వు బతికే ఉన్నావా" అన్నాడు.

"మా జీజాజీ తమ్ముడు - జుడువా భాయి - ఇద్దరూ ఒకేలా ఉంటారు - రామ్ ఔర్ శ్యామ్ లాగా" అన్నాడు నా బావమరిది రంగంలోకి దిగి.

"జుడువా భాయి ఉన్నట్లు ఎప్పుడూ చెప్పలేదే? అయినా, నేను బొంబానీనని నీకెలా తెలుసు?" - వాడు అనుమానంగా అడిగాడు.



"మా అన్నయ్య చెప్పాడు. దున్నపోతుకి సోడా బుడ్డి కళ్ళద్దాలు తగిలిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటాడు బొంబానీ అని చెప్పాడు. నువ్వు మా అన్నయ్యకి నాలుగు వందల అరవై రూపాయలు బాకీ ఉన్నావుట కదా."

"మీ అన్నయ్యే నాకు బాకీ ఉన్నానని చెప్పి ఉంటాడు." - దొంగ వెధవ, మనిషి కనుమరుగయ్యేటప్పటికి నాలుగు వందల రూపాయల గురించి నాలుగు వేల అబద్ధాలు చెప్పడానికి సిద్ధమయిపోతున్నాడు- "పోయిన వాణ్ణి పట్టుకుని నా బాకీ తీర్చమనేటంతటి దుర్మార్గుడు కాదు బొంబానీ... డబ్బుదేముంది? ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది. నిలిచేది మాటే..."

"అదీ నిలవదు కానీ, నువ్వే బాకీ ఉన్నావుట."

"కాదు... నాకివ్వాలి. నేనివ్వడం కాదు. పోయేటప్పుడు డెలీరియంలో మతి స్థిమితం లేక అలా అని ఉంటాడు..."

"లేదు, నువ్వే ఇవ్వాలిట. బొంబానీ నాకు నాలుగు వందల అరవై రూపాయలు బాకీ ఉన్నాడు అని చాలా స్పష్టంగా చెప్పాడు."

"పార్టీ ఇస్తానన్నాడు. అది చెప్పాడా?"


"చెప్పాడు. ఇదే పార్టీ" అన్నాను నాలుగు పూరీలు, హల్వా వడ్డిస్తూ.


ఏడుస్తూ, తిట్టుకుంటూ నా బాకీ తీర్చి, "నేనిలా అన్నానని ఏం అనుకోకు. పోయేవాడు కృష్ణా, రామా అనుకోకుండా, బొంబానీ, బాకీ అంటూ ఈ పితకలాటం ఏవిటి? డబ్బు గురించి ఇంత గోల పెట్టేవాడు నరకానికే పోతాడు" అన్నాడు.

"మంచిదే! రేపు అక్కడ నీకు కంపెనీ కావాలి కదా."

నా పుణ్య తిథి అంతా సవ్యంగా జరిగిపోయింది. ఎవరికీ ఏ అనుమానం రాకుండా నేను నా భౌతిక కాయాన్ని ఇక్కడే వదిలి అఫీషియల్‌గా మరణించాను.

నాలుగు నెలల్లో నా పెద్ద కొడుక్కి ఉద్యోగం వచ్చింది. నా చిన్న కొడుకు మోటారు కారు స్పేర్ పార్ట్స్ బిజినెస్ మొదలుపెట్టాడు. వాడి వ్యాపారం మూడు పూవులూ, ఆరు కాయలుగా అందుకు






పోయింది. అమ్మాయికి పెళ్ళయింది. అల్లుడికి కూడా వ్యాపారం. బాగా ఉన్నవాళ్ళు. అబ్బాయిలిద్దరికీ కూడా పెళ్ళయింది. వాళ్ళకి అన్ని విధాలా తగిన కోడళ్ళు వచ్చారు.

పంజాబీ బాగ్‌లో ఇల్లు- కార్లు. అంతా హాయిగా ఉన్నారు- నేను తప్ప.

ఒక రోజున అందరూ కూర్చునుండగా, మా పెద్ద కోడలు కొంచెం నసుగుతున్నట్టు మొదలు పెట్టింది- "ఇరుగూ పొరుగూ మావగారి గురించి 'ఎవరీయన' అని అడుగుతున్నారు..."

"మా దూరపు బంధువు అని చెప్పాం కదా" అంది మా ఆవిడ.

బొంబాయీకి జుడువా భాయి అని చెప్పినా, మా కుటుంబంలో నేనొక్కణ్ణే అని అందరికీ తెలును. అంచేత నన్ను అందరికీ, "ఈయన దూరపు బంధువు. ఎవ్వరూ లేరు. పాపం మాతోనే ఉంటున్నాడు" అని చెబుతున్నారు.

"చెప్పాను. అది కాదు... ఆయనకి, మీ అత్తగారికి సంబంధం ఏవిటి... అని..."

"అత్తగారూ, మావగారూ ఇద్దరూ మంచం మీద ఒకళ్ళని ఒకళ్ళు అనుకుని కూర్చుంటే ఎదురింటి ఆవిడ కిటికీ లోంచి చాలాసార్లు చూసిందట..." కుండ బద్దలుకొట్టినట్లు అనేసింది నా చిన్న కోడలు.

"అవును. అంతా... అనుకుంటున్నారు" అంది పెద్ద కోడలు.

"చచ్చిపోయిన మా మావగారితో మా అత్తగారు కాపురం చేస్తోందని చెప్పలేకపోయారా" అన్నాను నేను వెటకారంగా.

"జీజాజీ! నువ్వూరుకో."

మా ఆవిడ ఉన్నట్టుండి ఏడవడం మొదలుపెట్టింది.

"కిటికీ లోంచి అందరి పడక గదుల్లోకీ చూడడం తప్ప ఆవిడకి వేరే పని లేదేవిటి" అన్నాడు మా అల్లుడు. మావగారు ఏవైనా ఫరవా లేదు. అత్తగారి కన్నీరు చూడలేడు మా అల్లుడు.

"జీజాజీ ఏదో అంటూంటాడు. నువ్వు పట్టించు కోకు దీదీ" అని అక్కగారిని ఓదార్చాడు తమ్ముడు.

"ఆయన అలా ఏదో పిచ్చి వాగుడు వాగుతుం టాడు. ఆయన మాటల గురించి కాదు... నాకు... నాకు... నెల తప్పిందేమోనని అనుమానంగా ఉంది."

అంతా పిడుగు పడ్డట్టు అయిపోయారు - మా బావమరిదితో సహా.

మరుక్షణంలోనే పిడుగు దెబ్బ నుంచి కోలుకొని, "నో ప్రాబ్లం... దీనికి కంగారు దేనికి" అన్నాడు నవ్వుతూ.

"ఎలా" అంది నా పెద్ద కోడలు.

పెద్దన్నయ్య కొచ్చిన్లో నేవీలో ఉన్నాడు కదా! అక్కడ మన ఫామిలీ గురించి తెలునున్న వాళ్ళెవరుంటారు? దీదీని అక్కడకు పంపిం చేద్దాం. డెలివరీ అయ్యేదాకా అక్కడే ఉంటుంది."

"మరి పిల్లాడు?"

"వాడు మనతోనే ఉంటాడు. డెలివరీ అయ్యాకా పిల్లాణ్ణి తీసుకు వచ్చేస్తుంది. ఎవరో పుట్టిన బిడ్డని వదిలేస్తే జాలితో తెచ్చింది అని చెబుతాం. మన దగ్గరే పెరుగుతాడు. నో ప్రాబ్లం..."

అంతా తేలిగ్గా నిట్టూర్చారు.

"ఎలాంటి సమస్యయినా తేలిగ్గా తీర్చేస్తాడు మామాజీ" అన్నారు పిల్లలు ఆనందభాష్పాలు రాలుస్తూ.

"ఓరే బామ్మర్దీ! నీ తెలివి తేటలు అమోఘంరా. ఇలా రారా" అన్నాను, పరుపులు దులిపే కర్ర అందుకుంటూ.

"జీజాజీకి-మన బ్రెయిను ఎలాంటిదో ఇన్నాళ్ళకి తెలిసింది" అన్నాడు వాడు దగ్గరకు వస్తూ.

దగ్గరకు రాగానే వాడి జుట్టు పట్టుకుని కర్రతో దులపడం మొదలుపెట్టాను.

"దీదీ, జీజాజీ చంపేస్తున్నాడేవ్" అని వాడు గింజు కోవడం మొదలు పెట్టాడు. "ఏవిటీ? పిచ్చెక్కిందా" అంటూ అడ్డం వచ్చిన మా ఆవిడని, పిల్లల్ని - అల్లుడితో సహా - అందర్నీ ఉతికేసి అప్పట్నుంచీ ఇల్లొదిలి ఇలా దేశం మీద తిరుగుతున్నాను" అన్నాడతను.

ధాబా వైపు నుంచి లారీ హారన్ వినిపించింది. ఇద్దరం లేచి ధాబా వైపు నడవసాగాం.

"ఇప్పుడు ఎక్కడికి వెడుతున్నావు?"

"కలకత్తా."

"వారం రోజుల్లో ఢిల్లీ చేరుతాను. మీ వాళ్ళకేవైనా చెప్పమన్నావా?"

"వద్దు." అతను కచ్చితంగా అన్నాడు. "నేను వాళ్ళ దృష్టిలో చచ్చిపోయాను. వాళ్ళకీ, నాకూ ఏ సంబంధం లేదు."

నేనింకేం మాట్లాడలేదు. అతనే అడిగాడు- "బాబూజీ! నీకెంతమంది పిల్లలు?"

"ఇద్దరు- ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. ఏం?"

"డబ్బు కాకుండా జీవితానికి కొన్ని విలువ లుంటాయని నా పిల్లలకు నేను సరిగా చెప్పలేక పోయానేమో." అతను తనలో తాను మాట్లాడు కుంటున్నట్టు మాట్లాడసాగాడు. "నా పిచ్చిగాని, నేను చెప్పినా డబ్బు చుట్టూ ప్రపంచం తిరుగుతున్నపుడు మరో మాట వాళ్ళ బుర్రకి ఎక్కుతుందా?"

లారీ హారన్ మరోసారి గట్టిగా మోగింది. అతను కలకత్తా వెళ్ళే లారీ ఎక్కాడు. డ్రైవరు బేక్ చేసి మెయిన్ రోడ్డు మీదికి బండి తిప్పాడు. మెల్లిగా వేగం అందుకుని ప్రవాహంలా వెడుతున్న లారీలలో కలిసిపోయింది అతని లారీ. కనుపించినంతవరకు లారీ వెనుక వెలుగుతున్న ఎర్ర లైట్లకేసి చూస్తూ నిలబడ్డాను.

"బాబూజీ... చలే" అన్నాడు సర్దార్జీ నా పక్కకొచ్చి నిలబడి.

"చలో" అన్నాను నేనూ లారీ ఎక్కుతూ. ■